# ప్రొసీజర్

■ కొంచిరాజు శేషగిరిరావు

కాంతి పరావర్తనము ప్రయోగము చేస్తూ ఉంటే అకస్మాత్తుగా గుండు సూదులు అయి పోయాయి. కేశవులు చేతిలోని స్కెచ్ పెన్‌తో "దయచేసి కొన్ని గు ండుసూదులు పంపండి" అని ఇంగ్లీషులో వ్రాసి వానితోనే ప్రిన్సిపాల్ దగ్గరికి పంపించాడు గుండుసూదులు పట్టుకొని రమ్మని. ఆ విద్యార్థి కాగితం పట్టుకొని ప్రిన్సిపాల్ దగ్గరికి పోగానే అలవాటు ప్రకారం ఆఫీసుకు ఎండార్స్ చేసి ఆఫీసుకు పొమ్మన్నారు.

ఆ విద్యార్థి దగ్గరే వున్న ప్యూనుకు ఆ కాగితాన్ని ఇచ్చి, వాని దగ్గర వుండే కాగితాలకు ఉన్న పిన్నీసులు నాలుగు పట్టుకొని తుర్రుమని లేబరేటరీకి పోయి ప్రయోగం చేసుకోవడం మొదలు పెట్టుకొన్నాడు.

* * *

అన్ని ఫైళ్ళతో పాటు ఆ కాగితాన్ని ఆఫీసులో విసరి వేశాడు ప్యూనుగారు. అన్నిటికి పుటప్ చేసినట్టుగానే ఆ కాగితానికి నోటు పుటప్ చేశారు యు.డి.సి. గారు.

1. కాగితంలోని విషయం ఎవ్వరికి అడ్రస్ చెయ్యబడ లేదు. కనుక దానిపై ఏక్షన్ తీసుకోవడం సాధ్యం కాదు.

2. కాగితం సైజులో లేదు. ఇట్లాంటి రఫ్ కాగితాలపై రాయడం నేరం. దానిని గురించి వార్నింగ్ ఇవ్వవలె.

3. ఇది స్కెచ్ పెన్నుతో వ్రాయబడింది. స్కెచ్ పెన్నుతో అఫిషియల్ వ్రాయడానికి వీలు లేదు.

4. అన్నిటికన్నా ముఖ్యమైనది ఎర్ర ఇంకుతో వ్రాయడం. ఇది ఘోరమైన తప్పిదం. మరల ఎప్పుడు వ్రాయకుండా నోటీసు ఇవ్వాలి.

తేది: 14-3-86

శ్రీ కేశవులు ఎమ్.ఎస్‌సి. ఫిజిక్సు గార్కి,

మీరు ఈరోజు పెట్టిన రిక్విజిషన్‌కు ఎర్ర ఇంకు ఉపయోగించినారు. అది రూల్సు ప్రకారం తప్పు. తిరిగి ఎన్నడు కూడ ఇట్టి అప్లికేషన్స్‌కు ఎర్ర ఇంకు కాని, స్కెచ్ పెన్ను కాని ఉపయోగింపకూడదని హెచ్చరించు చున్నాను.

ప్రిన్సిపాల్

నోటెడ్ యు.డి.సి.
కేశవులు. ఎల్.డి.సి.

కొలీగ్: నీకు బుద్ధిలేదు కేశవులు. ప్రిన్సిపాల్ నోటీసు ఇవ్వగానే నోటెడ్ అని వ్రాయవచ్చా. దానితో నీ ఉద్యోగం కూడా ఊడిపోవచ్చు.

కేశవులు: మరి ఏం చెయ్యమంటావయ్యా! నేను లాబ్‌లో వున్నాను. ప్యూను వచ్చిగొంతుమీద కూర్చొనె. పిల్లలను డీల్ చేస్తున్నా. ఆక్కర్లుగా ప్యూనుతో కొట్లాడమంటావా?

కొలీగ్: ఇప్పుడు పోయి ప్రిన్సిపాల్ దగ్గరి నుంచి నోటీసు బుక్ వాపసు తీసుకో. నేను ఎర్ర సిరా ఉపయోగించి ఎప్పుడూ ప్రిన్సిపాల్‌కు వ్రాయలేదని, నాకు రూల్సు తెలుసునని ఆ నోటీసు క్రింద వ్రాసెయ్యి. ఈరోజు తేదీ మీద ప్రిన్సిపాల్‌కు గుండుసూదుల కొరకు వేరే రిక్విజిషన్ వ్రాసెయ్యి. లేకుంటే ఇరుక్కుపోతావు.

కేశువులు: థాంక్యూ సార్. నన్ను రక్షించారు.

* * * * *

తేది: 14-3-86

ప్రిన్సిపాల్ గారికి,

అయ్యా!

మా ఫిజిక్సు లాబ్‌లో గుండుసూదులు అయి పోయినవి. కావున ఒక పాకెట్ గుండుసూదులు ఇప్పించ ప్రార్థన.

కేశవులు, ఎమ్.ఎస్‌సి.,
ఫిజిక్సు

పుటప్

ప్రిన్సిపాల్
సబ్ మిటెడ్:

1. ఫిజిక్సు లాబ్‌కు గుండుసూదులు ఎందుకు అవసరమో రిక్విజిషన్‌లో లేదు.
2. పాకెట్ గుండుసూదులు అనగా ఎన్ని? అది తూకమా? లేక వస్తువా? స్పష్టముగా చెప్పవలెను.

ప్రిన్సిపాల్,
ఎల్.డి.సి. యు.డి.సి.

అయ్యా,

1. ప్రాక్టికల్స్ చెయించుటకు గుండుసూదులు అవసరము.

2. ఒక పాకెట్‌లో సుమారు 100 ఉండును.

కేశవులు



రీ డైరెక్టర్:

1. ఎన్ని ప్రాక్టికల్స్‌కు గుండుసూదులు అవసరము.
2. ఒక్కొక్క విద్యార్థికి ఎన్నిఅవసరమో వివరముగా వ్రాయ ప్రార్ధన.

ప్రిన్సిపాల్,
ఎల్.డి.సి. యు.డి.సి.

అయ్యా!
1. ఒక్కొక్క విద్యార్థికి సుమారు 10 సూదులు అవసరమగును.
2. రెండు ప్రాక్టికల్సులో అవసరముండును.

కేశవులు

శ్రీ కేశవులు గారికి,
ఒక్కొక్క విద్యార్థికి 10 సూదులుఅవసరమైనపుడు మీరు 100 మాత్రమే కోరుట ఆశ్చర్యముగా నున్నది.

150 మంది విద్యార్థులు ప్రాక్టికల్సు వెయ్యవలెనని మీకు గుర్తుండియే వచ్చును. దానిని గూర్చి సవివరముగా తెలుసుకొనవలసి వున్నది. ఈ క్రింది వివరములను 10 రోజులలోగా ఇవ్వగలరు.

1. గత అయిదేండ్లుగా మీరు కొన్న గుండుసూదుల స్టాక్ ఎంట్రీలు, డూప్లికేట్ బిల్లులతో సహా.
2. అవి ఖర్చు అయిన వివరములు.
3. వచ్చే కనీసము రెండు ఏండ్లకు గుండుసూదుల ఖర్చు ఎస్టిమేట్లు.
4. గత అయిదేండ్ల నుంచి జరిగిన స్టాక్ వెరిఫికేషన్ సర్టిఫికేట్లు.

ఇట్లు,
మీ
ప్రిన్సిపాల్,
ఎల్.డి.సి. యు.డి.సి.

* * * * *

"అయ్యా! కొలీగ్ ఇదేమిటయ్యా! నా దుంప తెంచుతున్నారు. ఇవన్నీ నేను ఏమి సబ్‌మిట్ వెయ్యగలుగుతాను. అయినా ఏభై పైసల గుండు సూదులకు రెండు రూపాయిల కాగితాలు ఖర్చయినాయి.

ఇంతవరకు వాటి అతీగతీ లేదు. ఆ వచ్చే గుండు సూదుల కొరకు చూస్తే ఈ బ్యాచి ప్రాక్టికల్సు నాశనం అయినట్లే."

* * * * *

కేశవులు:— మల్లయ్యా! మల్లయ్యా! ఈ బాదరబందీ నుంచి నీవే రక్షించాలి.

మల్లయ్య:— పదండి సార్. కేంటీన్‌కుపోయిమాట్లాడుకొందాం.

కేశవులు:— ఈ కథంతా నీకు తెలిసింది కదా!

మల్లయ్య:— ఫర్వాలేదు. అన్నీ నేను చూచుకొంటాలెండి. ఇంకా ఈ రిక్విజిషన్‌పైన స్టూడెంట్స్‌సంతకాలు కావాలి. కొలీగ్స్ సంతకాలు కావాలి. టెండర్లు పిలవాలి. ఆర్డరు ఇవ్వాలి. అవి వచ్చినతర్వాత పేమెంట్ చెయ్యాలి. అప్పుడు మీకు గుండుసూదులు ముట్టినట్లు.

కేశవులు:—ఇవన్నీ ఎప్పటికవుతాయి.

మల్లయ్య:— మా తాత కోర్టుకు పోయిన కేసులు 14 ఏండ్లకు తెగుతాయి అనేవాడు. ప్రొసీజర్ ప్రకారం పోతే 28 ఏండ్లకైనా మీకు సూదులు వస్తే చాలనుకోండి.

